నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

ముషీరాబాద్: నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, కళాధర్‌నగర్‌లో రూ.14 లక్షలతో పార్కు నిర్మాణ పనులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధ్వానంగా మారిన రోడ్లను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్తవాటిని వేస్తున్నామన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జీహెచ్‌ఎంసీ పార్కులను ఆధునీకరించడంతో పాటు ఓపెన్‌జిమ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌ల నిర్మాణం అనంతరం పెరిగిన జనాభాకనుగుణంగా రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పూస గోరఖ్‌నాథ్, శ్రీధర్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈ మురళీ తదితరులున్నారు.


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎమ్మెల్యే, కార్పొరేటర్ మధ్య వివాదం...

ముషీరాబాద్‌లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు తామే నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెబుతుండగా.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధుల నుంచి విడుదల చేయించి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. పక్కనే ఉన్న ఇరు పార్టీల నేతలు ఇద్దరికి సర్దిచెప్పడంతో గొడవ సద్దుమనిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

ముషీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తున్నామని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని మొరంబగొంద, గంగపుత్ర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రూ.11 లక్షలతో ఆర్వో ప్లాంట్, విద్యార్థులు కుర్చోడానికి కుర్చీలు, టేబుల్స్, స్కూల్ ఉపాధ్యాయులకు ప్రత్యేక కుర్చీలను అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ల సహకారంతో కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్‌ఆర్) నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు సమకూర్చుతున్నామన్నారు. పాఠశాలల్లో కావాల్సిన సదుపాయాల కోసం ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సమకూర్చుతామన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, బీజేవైఎం నగర కార్యదర్శులు అనిల్ కుమార్, అజయ్‌గుప్తా, పార్టీ నాయకులు లక్ష్మణ్, ఎమ్మెన్ చారి తదితరులున్నారు.


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి


విద్యార్థి వసతి గృహంలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు

కాచిగూడ: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు అన్నారు. మంగళవారం కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్యూరిఫైర్ డ్రింకింగ్ వాటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనేక రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. హాస్టల్‌లో విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు స్టడీ రూమ్, న్యూస్‌పేపర్స్, కాంపిటివ్ బుక్స్, మెస్ ఫెసిలిటీ, వాష్‌రూమ్స్ రినోవేషన్, వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తి స్థాయిలో హాస్టల్ రూమ్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు మెంబర్, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు, ఆకుల నాగేష్, పన్నాల విష్ణువర్ధన్, ఎలగందుల దేవేందర్, మేనేజర్ ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. ఉద్యమకారుల ద్రోహిగా మారిన కేసీఆర్ పార్టీని చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ఉద్యమకారుల కోసం 250 గజాల ఇంటిస్థలం హామీని ఆరు గ్యారంటీల్లో ఇచ్చారని తెలిపారు. హామీ ప్రకారం ఉద్యమకారులకు వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జూన్ 2న ఉద్యమకారులను ఆయా ప్రాంతాల్లో సన్మానించాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.10 వేలకోట్లు కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, కన్వీనర్ ఐలయ్యయాదవ్, వెంకటేష్‌గౌడ్, సుదర్శన్, వీరస్వామి, ఆనంద్, కోళ్ల జనార్దన్, అఖిలేష్, నర్సింహ్మారెడ్డి, మహిళా అధ్యక్షురాలు జ్యోతి తదితరులున్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలకు విద్యార్థులు చేరువ


ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

కవాడిగూడ: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ సూచించారు. మంగళవారం కవాడిగూడ బీమామైదాన్ సమీపంలో ఉన్న శ్రీసాయిరాం హైస్కూల్ 43వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ రచనశ్రీలు ముఖ్య అతిథిగా జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, ఆటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు బట్టీ చదువులకు స్వస్తి పలికి ఇష్టంతో విద్యను అభ్యసించినప్పుడే చదువుల్లో రాణిస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారి అభిరుచులకు అనుగుణంగా వారిని ప్రోత్సహించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జయేందర్‌బాబు, సీనియర్ అడ్వకేట్ శీలం సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ ప్రమీల, పాఠశాల వ్యవస్థాపకులు కార్యదర్శి నర్సింహగౌడ్ ప్రిన్సిపాల్ ఎస్. రాజశేఖర్ తదితరులున్నారు.

భూ సర్వే చేపట్టి ధరణి లోపాలను సరిచేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమగ్ర భూ సర్వే నిర్వహించి ధరణి లోపాలను సవరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. 2.45 లక్షల దరఖాస్తులకు 1.10 లక్షల దరఖాస్తులు మాత్రమే పరిష్కరించినట్లు అధికారులు చెప్పారన్నారు. ధరణిలో ఉన్న లోపాలను సరిచేయడం ద్వారా భూమాత పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వం పాస్ పుస్తకాల చట్టం 1971లోని సెక్షన్ 26ను మాఫీ చేసిందని, గత లోపాలకు తోడు అదనపు లోపాలతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, డబుల్ బెడ్రూంలు, ప్రాజెక్టులు, రహదారుల పేరుతో పేదల భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి సమగ్ర భూ సర్వే నిర్వహించి ధరణి లోపాలు సవరించాలన్నారు. పోతినేని సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్.వెంకటరాములు, జూలకంటి రంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి, ప్రమీల, ప్రసాద్, శోభన్‌నాయక్ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టి.సాగర్

రైల్వే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు


మాట్లాడుతున్న డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్

కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ అన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగిన 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్' ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్, రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ఈ సందర్భంగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. జోనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యులు కాశీనాథ్, అమర్‌నాథ్, శివ శంకర్, డాక్టర్ రాజ్‌కుమార్, రైల్వే అధికారులు అనూప్‌కుమార్, విష్ణు చౌదరి, డాక్టర్ ప్రణయవాణి, బాలాజీ, కె.భాగ్యం, కె.గోవిందరావు, జీవి.రావు, రాము, ఆర్.బి.మీనా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అంబర్‌పేట: ప్రజలకు మౌళిక వసతులు కల్పించేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు భారీ ఎత్తున నిధులు మంజూరు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. అభివృద్ధి పనులను స్థానికులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్థానికంగా ఉన్న పార్క్‌లో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. బస్టాప్ అందుబాటులో లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ రోహిత్, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌కె బాబు, బుచ్చిరెడ్డి, సంతోష్, పాషా, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.


అశోక్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

సమాజ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం


మాట్లాడుతున్న న్యాయమూర్తి పద్మావతి

చిక్కడపల్లి: సమాజాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని సీనియర్ న్యాయమూర్తి , న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి అన్నారు. మంగళవారం సాయంత్రం డివిజన్‌లోని చిక్కడపల్లిలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఎల్.అరుణ, సంయుక్త, కమలాకుమారి, నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, సుజాత, ఝాన్సీరాణి, విద్యాదేవి, కేథరిన్, మల్లిక, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

రంజాన్‌మాసం తొలిరోజు ప్రార్థనలు

ముషీరాబాద్: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం మంగళవారం మొదటిరోజు ప్రార్థనలకు పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి రాత్రి వరకు ఐదుసార్లు ప్రార్థనలు చేసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన బడీ మసీద్‌లో వేల సంఖ్యలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ నేతలు

అంబర్‌పేట: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన సభకు బాగ్ అంబర్‌పేట డివిజన్ నుంచి ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మంగళవారం ఎల్‌బీ స్టేడియంలో కేంద్రమంత్రి అమిత్‌షా హాజరయ్యే సభకు బైక్‌ర్యాలీతో రెడ్ బిల్డింగ్ చౌరస్తా నుంచి నేతలు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేతలు చుక్క జగన్, అజయ్‌కుమార్ తదితరులున్నారు.

స్వయం ఉపాధిలో మహిళలకు శిక్షణ

కవాడిగూడ: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల స్వయం ఉపాధికోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న మహిళలు మాట్లాడుతూ.. తాము స్వశక్తితో ఎదిగి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మహిళల వ్యక్తిగత అలంకరణ, చర్మరకాలు, కేశాలంకరణ, కాస్మొటిక్స్ తదితర అంశాలపై గంగపుత్ర సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణను ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

కామర్స్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కామర్స్ చదువుతున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో కామర్స్ విభాగం తరపున రిసెర్చ్ మెథడాలజీలో భాగంగా 'ఏ వర్క్‌షాప్ ఆన్ హౌ టూ ప్రిపేర్ ఏ ప్రాజెక్టు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కామర్స్ విద్యార్థులకు వ్యాపారరంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. దేశ విదేశాల్లో అనేక కంపెనీల్లో అవకాశాలు లభిస్తాయని వివరించారు. కామర్స్‌లో నైపుణ్యాన్ని సాధించుకోవాలని సూచించారు. అకాడమీ డైరెక్టర్ రిషికాంత్, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చాంపియన్స్..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పవర్ లిఫ్టింగ్ చాంపియన్స్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు మెడల్స్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ మట్ట శేఖర్ తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 2024 'ఇంటర్ కాలేజ్ ఎట్ పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్'కు తమ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు పాల్గొనగా.. నలుగురు మెడల్స్ సాధించారన్నారు. 66 కేజీల విభాగం 480 కేజీల్లో జగదీష్ బీకామ్ ఫైనల్ ఇయర్ విద్యార్థి గోల్డ్‌మెడల్ సాధించాడని, ఎస్.సతీష్, వాసీంలకు సిల్వర్ మెడల్స్, ఎండీ ఆసీఫ్‌కు బ్రాంచ్ మెడల్స్ లభించాయన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో 21 మంది విద్యార్థులు పాల్గొనగా.. తమ కళాశాల విద్యార్థులు చాంపియన్స్‌గా నిలిచారన్నారు. ఇంటర్ కాలేజ్ యూత్ సెక్రటరీ డాక్టర్ కృష్ణా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్దిఖీ తదితరులు తమ విద్యార్థులకు మెడల్స్ అందజేశారని తెలిపారు.


ఓయూ కామర్స్ హెచ్‌ఓడీ డాక్టర్ చెన్నప్పను సన్మానిస్తున్న దృశ్యం

ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

కాచిగూడ: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న ఆరెకటికల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆరెకటిక సంఘం అడ్వైజర్, ఎంసీహెచ్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎస్.గోపాల్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి అభినందన సభను నింబోలిఅడ్డలోని ఏకే భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరెకటికలను బీసీ -డి గ్రూపు నుంచి బీసీ -ఏ గ్రూపులోకి మార్చడానికి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని తెలిపారు. కాచిగూడ, జియాగూడ, బోయిగూడ, గౌలిపుర తదితర కబేలాలపై ఆధారపడి జీవిస్తున్న ఆరెకటికల సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేస్తానన్నారు. ఏకే భవన్ ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపునకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, రమేష్‌కుమార్, నర్సింగ్‌రావు, శశింద్ర, యశ్వంత్‌రావు, కృష్ణ, నర్సింగ్ ఆరెకటిక ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రేమ చూపించాలి

హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ భాస్కర్‌రావు

నల్లకుంట: మానసిక వికలాంగులపై చూపించాల్సింది జాలి కాదని, వారికి చేయూతనందించాలని హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ వైవీ. భాస్కర్‌రావు అన్నారు. ఓయూ విశ్రాంత లెక్చరర్ మురళీధర్‌రావు మంగళవారం బాగ్ అంబర్‌పేట శారదానగర్‌లోని శ్రీ గురు సంకల్పం మానసిక వికలాంగుల వృత్తి శిక్షణ పునరావాస కేంద్రం విద్యార్థులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హైకోర్టు విశ్రాంత జడ్జి వైవీ. భాస్కర్ రావు హాజరయ్యారు. గురువు దివంగత సీవీవీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్‌ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేష్‌చందర్‌రావుతో కలిసి మానసిక వికలాంగులకు అన్నం, స్వీట్లు, పండ్లు వడ్డించి ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీతో పాటు వృత్తి నైపుణ్యంలో శిక్షణనిస్తూ.. వారిలో ఆత్మవిశ్వాసం కల్పించడం అభినందనీయమన్నారు. ఇక్కడ తయారు చేసే స్క్రీన్ ప్రింట్ జ్యూట్ బ్యాగులు, పేపర్ ప్లేట్స్, అగర్‌బత్తీలు, క్యాండిల్స్, ప్రమిదలు తదితర ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా తోడ్పాటునందించాలన్నారు. టీబీఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేష్ చందర్ రావు, ప్రతినిధులు రామారావు, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ సుభాష్, కాంగ్రెస్ నేతలు ఎస్.హరినాథ్‌రెడ్డి, సీహెచ్. మురళీకృష్ణ, గురు సంకల్పం మానసిక వికలాంగుల కేంద్రం వ్యవస్థాపకులు సుబ్బలక్ష్మి, కోటయ్య, ఉపాధ్యాయులు లక్ష్మి, సత్యబాల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్‌రావు తదితరులు

పవర్‌బోర్ ప్రారంభం

కాచిగూడ: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాచిగూడ ఇందిరానగర్‌లో రూ.6 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను ఆయన స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రహమత్‌బాగ్‌లోని సమోసా పార్కు, విక్రమ్‌నగర్ పార్కులో ఓపెన్ జిమ్‌ల ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కృష్ణయాదవ్, కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, ఎం.నర్సింగ్‌రావు, అశోక్ కులకర్ణి, మల్లికార్జున్, బల్వీర్, త్రిభువన్‌రెడ్డి, భీమ్‌రాజ్, లావణ్య, తారా, రమాదేవి, ప్రశాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.


పవర్‌బోర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఓపెన్‌జిమ్ ప్రారంభం

నల్లకుంట: పార్కుల్లో ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు స్థానికులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని మణెమ్మపార్కులో నూతంగా ఏర్పాటు చేసి ఓపెన్‌జిమ్‌ను మంగళవారం కేంద్రమంత్రి ప్రారంభించి మాట్లాడారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి కృష్ణయాదవ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు పాల్గొన్నారు.

గల్లీ బిడ్డగానే అభివృద్ధికి కృషి చేస్తా

బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

చిక్కడపల్లి: ఢిల్లీకి రాజైనా గల్లీకి బిడ్డగానే ముషీరాబాద్ నియోజకవర్గాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం సీఎస్‌ఆర్ నిధులతో గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ స్ట్రీట్ నంబర్-4లో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్, అశోక్‌నగర్ కల్చరల్ కమ్యూనిటీహాల్‌లో ఫర్నిచర్, టేబుల్స్, అల్మారాలను కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలో ఉత్తర్‌ప్రదేశ్ రాజ్యసభ ఎంపీగా ఉన్నప్పటికీ తాను చదువుకుని రాజకీయ ఎదుగుదలకు తోడ్పడిన ముషీరాబాద్ నియోజవర్గానికి సీఎస్‌ఆర్ నిధులతో సేవలదించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకులు పూస రాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు టి.గోపాల్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, ఆకుల సురేందర్, అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్, కమ్యూనిటీహాల్ అధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి సూర్యప్రకాష్, ఐఎస్‌ఎస్ మూర్తి, సూర్యనారాయణ, పద్మావతి, నాగలక్ష్మిలు నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్

పోస్టర్ ఆవిష్కరణ


మహిళా క్రీడోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

కాచిగూడ: 'ఖేలో తెలంగాణ – జీతో తెలంగాణ' పేరుతో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న మహిళా క్రీడోత్సవాల నిర్వహణ పోస్టర్‌ను మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. 14న ఉదయం 7:30 గంటలకు సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడాపోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిత్య జీవితంలో మానసిక ఒత్తిడికి లోనవుతున్న మహిళలకు ఇలాంటి క్రీడల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ఏడెల్లి అజయ్‌కుమార్, అమృత, కేతినేని సరళ, డాక్టర్ సమత, సూర్యప్రకాష్‌సింగ్, శ్యామ్‌రాజ్, యశ్వంత్, భాస్కర్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శన

ముషీరాబాద్: కళాత్మకంగా ఆలోచిస్తే ప్రతి వస్తువులో కళాకృతుల్ని రూపొందించవచ్చని రెడ్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ కమటం రఘు తెలిపారు. అందుబాటులో ఉన్న వస్తువులతో నమూనాలను తయారుచేసి విద్యార్థులు ఔరా అనిపించారు. మంగళవారం రాంనగర్‌లోని పాఠశాల ఆవరణలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌ను ప్రదర్శించారు. టీ కప్పులు, ఐక్రీమ్ స్పూన్స్ వినియోగిస్తూ.. రంగుల రట్నం, కూల్‌డ్రింక్స్ బాటిళ్లతో ఫ్లవర్ వాజ్, గాజుసీసాలకు పెయింట్, ఈయర్ బడ్స్, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, స్పూన్స్, అట్టముక్కలు, చాక్లెట్ కవర్లు వివిధ రూపాల్లో నమూనాలను తయారు చేసి అందరిని ఆకట్టుకున్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనను వెలికి తీయవచ్చని ప్రిన్సిపాల్ సైజన్య పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదలకు విద్యతో పాటు వైద్యం కూడా అందుబాటులో ఉండాలని ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెంకట కృష్ణారావ (బబ్లూ), తెలంగాణ హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావులు తెలిపారు. మంగళవారం 'ది డెంటల్ హబ్' వార్షికోత్సవం సందర్భంగా భారీకేక్‌ను కట్‌చేసి పేదలకు ఉచిత వైద్యం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు వైద్యసంస్థలు కూడా ముందుకొచ్చి పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని కోరారు. ది డెంటల్ హబ్ డైరెక్టర్ డాక్టర్ ఆసిఫ్‌ఖాన్, వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఆర్.సంతోష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, టి.స్కైలాబ్‌బాబు, రఫీ అహ్మద్‌ఖాన్, పద్మగౌడ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయ విద్యార్థులకు చేయూత

కాచిగూడ: నిస్సహాయ విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. అర్హులైన మున్నూరుకాపు విద్యార్థులు ఈనెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 28న కాచిగూడ మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో జరిగే కార్యక్రమంలో ఆర్థికసాయం చేస్తామన్నారు. వివరాలకు 9491627404.